ప్రజాదర్బార్
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
ఆదివారం,మే, 17,2026 పేజీలు : 8

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం

పినపాక, మే 16, ప్రజాదర్బార్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను జూబ్లీహిల్స్ మంత్రి నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు, పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలపై చర్చించినట్లు సమాచారం. అలాగే నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

# విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా విద్యా వారోత్సవాలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత్, కేశవ పాటిల్

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి మే 16 (ప్రజా దర్బార్)నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశమందిరంలోవిద్యాశాఖఆధ్వర్యంలో అత్యంత వైభవంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యా ప్రదర్శనలు, ప్రతిభా ప్రదర్శనలతో సభా ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు స్వాగత నృత్యాలు, జానపద కళారూపాలు, దేశభక్తి గీతాలు, సామాజిక సందేశాలతో కూడిన నాటికలను ప్రదర్శించి అతిథులను అలరించారు. విద్యార్థులు రూపొందించిన టిఎల్ఎం ను తిలకించి, విద్యార్థుల ప్రతిభను చూసి జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మకకార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి విద్యా వారోత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని, భవిష్యత్ సమాజ నిర్మాణంలో విద్యార్థులే ప్రధాన శక్తిగా నిలుస్తారని, అందుకే వారిలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, మౌలిక వసతుల అభివృద్ధి, ఆంగ్ల మాధ్యమ బోధన వంటి చర్యల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిని ఉన్నత లక్ష్యాల దిశగా నడిపించాలని సూచించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం విద్యతో పాటు నైతిక విలువలు కూడా ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కృషి చేస్తే తప్పకుండా విజయం సాధించగలడని ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయికి ఎదగగల సామర్థ్యం కలిగి ఉన్నారని, వారికి సరైన మార్గదర్శకత్వం లభిస్తే దేశానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. విద్యా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం,



క్విజ్, సైన్స్ ప్రదర్శనలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, మెడల్స్, బహుమతులు అందజేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, వెంకటయ్య మురళీధర్ రెడ్డి శోభారాణి, షర్ఫుద్దీన్, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి నాగేశ్వర్ రావు, వివిధ మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో రౌడీయిజాన్ని కనుమరుగు చేస్తాం.

# ప్రతివారం రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్ల పై తనిఖీలు.

### పద్ధతి మార్చుకోని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్..

ఆదిలాబాద్ ప్రతినిధి ప్రజాదర్బార్ మే 16: రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే అన్ని రకాలుగా అణచివేస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ హెచ్చరించారు. శనివారం ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా లోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు. వారికి సూచనలు చేయడం జరిగిందన్నారు. రౌడీయిజం,

గుండాయిజం ప్రజలను మోసం చేయడం, బెదిరించడం లాంటివి చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగిన వారికి రౌడీషీట్లు తొలగించి సరైన న్యాయం చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను బెదిరించడం, డబ్బులు వసూలు చేయడం, రౌడీయిజం చేయడం లాంటివి మానుకోవాలని సూచించారు. రౌడీ షీటర్ల పై ఉన్న కేసుల వివరాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ, నమోదైన కేసులను న్యాయస్థానాలలో శిక్షలు పడేవిధంగా కృషి చేస్తూ, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణ కల్పించడానికి తన వంతు పూర్తిస్థాయిలో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు ఉన్నా, మళ్ళీ తిరిగి గంజాయి దందా మట్కా దందా, రౌడీ ఇజం, హత్యలు, హత్యాయత్నాలు, నేరాలు, ప్రజలను బెదిరించడం, కొట్లాటలు, గొడవలు, దొంగతనాలు, ల్యాండ్ మాఫియా, భూములను ఆక్రమించడం, నకిలీ పత్రాలను సృష్టించడం లాంటివి తిరిగి మొదలుపెట్టిన వారిపై పిడి యాక్టర్ నమోదుకు సైతం వెనకాడ బోనని హెచ్చరించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో కత్తులతో పోస్టులు పెట్టడం, రెచ్చగొట్టడం, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తూ ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం, లాంటివి చేస్తే సహించేది లేదని తెలిపారు. నేరాలు లేని సమాజాన్ని తయారు చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. రాత్రి



సమయాలలో అనవసరంగా బయటకు తిరగవద్దని సూచించారు. జిల్లాలో గత సంవత్సరం 1300 పైగా రౌడీ షీట్స్ సస్పెక్ట్ షీట్స్ నమోదు అయి ఉండగా, వాటిలో సత్ప్రవర్తనగా ఉన్న 500 షీట్స్ తొలగించడం జరిగిందని, నూతనంగా 300 జత చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రతివారం పోలీసులు పిలిచినప్పుడు, ఇంటికి వచ్చినప్పుడు సహకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, కే ఫణిధర్, కర్ర స్వామి, ఎస్సైలు విష్ణువర్ధన్, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూపై అవగాహన కల్పించిన అధికారులు



తంగళ్లపల్లి, మే 16(ప్రజా దర్బార్):తంగళ్లపల్లి మండల కేంద్రంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డీఎంహెచ్ఓ రజిత మాట్లాడుతూ గ్రామాల్లో డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. గ్రామస్థులు ఆరోగ్య శాఖ అధికారులకు సహకరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా డీఎంహెచ్ఓ రజిత, తంగళ్లపల్లి సర్పంచ్ మోర లక్ష్మీరాజం, పద్మనగర్ సర్పంచ్ మోర నిర్మల, ఆశా వర్కర్లు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డుపై వడ్ల రాశి..... వాహనదారులకు ఇబ్బందులు

జగదేవపూర్ (ప్రజాదర్బార్) మే 16: జగదేవపూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రధాన రోడ్డుపై రైతులు వడ్లు ఆరబెట్టడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుమధ్యలో వడ్లు పరచడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చిన్నపాటి ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. వడ్ల దుమ్ము, జారుడు పరిస్థితుల కారణంగా వాహనదారులు నియంత్రణ కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఈ పరిస్థితిపై అధికారులు స్పందించి, రహదారులపై వడ్లు ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## మోటకొండూర్‌లో ఏసీబీ వలకు చిక్కిన అసిస్టెంట్ లైన్‌మెన్

మోటకొండూర్,ప్రజాదర్బార్ మే 16:వ్యవసాయ బోర్‌వెల్‌కు విద్యుత్ సరఫరా కల్పించేందుకు రూ.35 వేల లంచం తీసుకుంటూ టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ (ఏఎల్ఎం) పప్పుల రమేష్ శుక్రవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు.మోటకొండూరు మండలానికి చెందిన ఓ రైతు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పనుల కోసం అధికారులను సంప్రదించగా,విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు రమేష్ లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.బాధితుడి ఫిర్యాదుతో నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో రంగంలోకి దిగి,లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుంచి రూ.35 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.అనంతరం అతడిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు.కేసు దర్యాప్తు కొనసాగుతోంది.ఈ ఘటనతో విద్యుత్ శాఖలో కలకలం రేగింది.అవినీతి కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినట్లయితే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.



## ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం: బి ఎల్ ఆర్

మిర్యాలగూడ, మే 16 ప్రజా దర్బార్:- పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఎమ్మెల్యే స్వయంగా పర్యటించి రోడ్డు విస్తరణ, పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ లపై వారికి కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీ ఎల్ ఆర్ మాట్లాడుతూ రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లపై కస్టమర్లు వాహనాలు నిలపకుండా చూడాల్సిన బాధ్యత వ్యాపారస్తులదేనన్నారు. కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు ఉంచేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సాగర్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలన్నారు. వాహనదారుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని, అవసరమైనచోట యూ టర్న్ లు ఏర్పాటు చేస్తామన్న ఎమ్మెల్యే, ట్రాఫిక్ ఫ్రీ సిటీ గా తీర్చిదిద్దేందుకు ప్రజలు, వ్యాపారుల సహకారం కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధా బాలు, వైస్ చైర్మన్ శిరీష నవీన్, కమిషనర్ శ్రీనివాస్, డీఎస్పీ రాజశేఖర్ రాజు, సిఐ జెట్టి సోమ నరసయ్య,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు దైద సోంసుందర్, ఆదోతు అశోక్ నాయక్, బంటు శ్రీనివాస్, ఆంగోతు శక్తి నాయక్, అవుట శ్రీనివాస్, ఎస్సైలు రాంబాబు,కృష్ణయ్య, శ్రీకాంత్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ చల్లా శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సాహితీ రంగానికి శారదా అశోకవర్ధన్ మృతి తీరని లోటు
### -బాలచెలిమి ప్రధాన సంపాదకులు, ప్రచురణకర్త మణికొండ వేదకుమార్

హైదరాబాద్, మే 15 (ప్రజా దర్బార్) : తెలుగు సాహితీ రంగానికి శారదా అశోకవర్ధన్ మృతి తీరని లోటు అని బాలచెలిమి(పిల్లల వికాస పత్రిక) ప్రధాన సంపాదకులు, ప్రచురణకర్త మణికొండ వేదకుమార్ అన్నారు. ఆమె సాహితీ లోకానికి సుపరిచితమైన వ్యక్తి అని కొనియాడారు. ఆమె మరణంపై ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆకాశవాణి శ్రోతలకు, దూరదర్శన్ ప్రేక్షకులకు, నాటకాలు, నాటికలు, సంగీత రూపకాలు, పాటలు, నవలలు, కథల ద్వారా విశిష్టమైన సాహిత్య సేవ అందించారని గుర్తు చేశారు. బాలసాహిత్య అభివృద్ధికి ఆమె చేసిన కృషి ప్రశంసనీయం అన్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా బాలచెలిమితో ఆమెకు ఆత్మీయ అనుబంధం కొనసాగిందని పేర్కొన్నారు. ఆమె రచనలు బాలచెలిమిలో ప్రచురితం అయ్యాయని, బాలల సాహిత్య వర్క్‌షాప్‌లలో ఆమె అందించిన సహకారం, అనేక సందర్భాల్లో అందించిన మార్గదర్శనం చిరస్మరణీయమని తెలిపారు. పిల్లల సాహిత్యానికి అంకితభావంతో ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## నేటినుండీ సెంట్రింగ్ పని బంద్




ప్రజాదర్బార్, ఇబ్రహీంపట్నం, మే16: సిఐటియు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో అంబేద్కర్ చౌరస్తాలో సెంట్రింగ్ రేట్లు పెంచాలని నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చింత పట్ల ఎల్లేశ మాట్లాడుతూ హైదరాబాదులో ఉన్న కొన్ని సెంట్రింగ్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా బందుకు పిలుపునివ్వడం జరిగింది , అందుకు వారికి మద్దతుగా ఇబ్రహీంపట్నం బిల్డింగ్స్ అదర్స్ కన్స్ట్రక్షన్ సెంట్రింగ్ యూనియన్ సిఐటియు గా సెంట్రింగ్ రేట్లు పెంచాలని బందు పెట్టారు. నిత్యవసర ధరలు కిరాణా, పెట్రోల్ గ్యాస్ అనేక ధరలు ఎక్కువ పెరిగిపోయాయి, సెంట్రింగ్ కాంట్రాక్టు వాళ్లకు మాత్రమే రేట్లు తక్కువగా ఉన్నాయి, సెంట్రింగ్ మెటీరియల్స్ కూడా విపరీతంగా రేట్లు పెరిగిపోయాయి, కాబట్టి జాక్ సెంట్రింగ్ రేట్లు పెంచాలని, జీరో నుండి పది ఫీట్ల స్లాబ్ ఎత్తు వరకు 51 రూపాయలు ఇవ్వాలని, సెంట్రింగ్ కార్మికులకు ప్రభుత్వము 30 రోజులు ట్రైనింగ్ ఇచ్చి ఐదు లక్షల రూపాయలు సెంట్రింగ్ మెటీరియల్స్ కోసం బ్యాంకు ద్వారా రుణ సబ్సిడీలు ఇవ్వాలని, కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే 20 లక్షల రూపాయలు బీమా సౌకర్యం ఇవ్వాలి, ఈఎస్ఐ ఐదు లక్షల రూపాయలు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు యెలమోని స్వప్న,సీఐటీయూ మండల కన్వీనర్ పి.జగన్,సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షులు రామావత్ మహేష్, కార్యదర్శి కొంగర జంగయ్య, కోశాధికారి చిట్టి రాములు, ఉపాధ్యక్షులు చింత పట్ల మహేందర్, ఎ.సత్యం, సహాయ కార్యదర్శి మంత్రి యాదయ్య, చింతపట్ల కుమార్, డి లింగం, యు రాములు, జరిగే భాష, చిట్టి బాల్రాజ్, మేడిపల్లి సుధాకర్, జనగే నరసింహ పాల్గొన్నారు

## పెట్రోల్ డీజిల్ ధర తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి మే 16 (ప్రజాదర్బార్) నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోసిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పెంచిన పెట్రోల్ డీజిల్ ధర తగ్గించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అచ్చంపేట పట్టణ కేంద్రంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మారేడు శివశంకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మోడీ మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధర పెంచనని ప్రజలకు చెప్పడం జరిగింది ఎన్నికల అయిపోయినంక హైదరాబాద్ వచ్చి గ్యాస్ వాడకం తగ్గించండి పెట్రోల్ వాడకం తగ్గించండి బంగారం కొనొద్దు చెప్పడం జరిగింది కానీ హైదరాబాదు నుండి ఢిల్లీకి పోయినంక మూడు రోజులకే డిజిల్‌పెట్రోల్ గ్యాస్ రేట్లు పెంచడం జరిగింది, రోజువారి ఆటో నడుపుకుంటే ఆటో కార్మికుడు ఆటో నడపకపోతే బతికేయట్లా

# జాతీయ డెంగ్యూ దినోత్సవం ర్యాలీ ప్రారంభం

## ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ సంధ్య పి.హెచ్. సి .చించోడు

రంగారెడ్డి బ్యూరో చీఫ్ 16 మే (ప్రజాదర్బార్):- భారతదేశంలో ప్రతి సంవత్సరం మే 16వ తేదీన జాతీయ డెంగ్యూ దినోత్సవం జరుపుకుంటారు. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ డెంగు దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు లో డాక్టర్ సంధ్య ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారి జాతీయ డెంగ్యూ దినోత్సవం ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ హెల్త్ ఎడ్యుకేట్ ఆర్ జె శ్రీనివాసులు డెంగు వ్యాధి నివారణ గురించి దోమల నివారణ గురించి స్లోగన్స్ చెప్పుకుంటూ ర్యాలీని చించోడు గ్రామంలో ముందుకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, హెల్త్ సూపర్వైజర్లు,ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటెడ్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ డెంగ్యూ ఒక ప్రమాదకరమైన వైరల్ జ్వరము అని, ఇది డెంగ్యూ ఫేవర్ వ్యాధిని కలిగించే ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. డెంగ్యూ వచ్చినప్పుడు అధిక జ్వరం తీవ్రమైన తలనొప్పి కళ్ళ వెనుక నొప్పి శరీరం నొప్పులు వాంతులు మరియు చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి అని, కొన్ని




సందర్భాల్లో ఇది ప్రాణాపాయం కూడా కలిగించవచ్చు అని జె.శ్రీనివాసులు చెప్పారు. అందుకే ముందు జాగ్రత్తలు చాలా అవసరమని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడడం, నీటి ట్యాంకులు మరియు పాత్రలను మూతపెట్టడం, పాత టైర్లు మరియు కొబ్బరి చెక్కలలో నీరు నిల్వ కాకుండా తొలగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లి డాక్టర్ ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. గ్రామాలలో పరిశుభ్రత పాటించడం ద్వారా డెంగ్యూ నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. చివరగా నేను చెప్పేది ఒకటే అని హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు "డెంగ్యూ పై అవగాహన పెంచుదాం...
దోమల పెరుగుదలను అరికడుదాం....
ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం"చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్. ఎల్. హెచ్. పి . వైద్య అధికారులు డాక్టర్ సంధ్య ,డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ, ఏఎన్ఎంలు లలిత, మధువాణి, హాస్పటల్ సిబ్బంది శ్రీనివాసులు, మణెమ్మ మరియు ఆశలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పార్కులో సమ్మర్ క్యాంపు..






ఆదిలాబాద్ ప్రతినిధి ప్రజాదర్బార్ మే 16:ఆదిలాబాద్ ట్రాఫిక్ పార్కులో శనివారం సమ్మర్ క్యాంప్ ప్రారంబించారు. ఆదిలాబాద్ జిల్లా చరిత్రలోనే మొట్టమొదటిసారిగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ అధ్యక్షతన ఆదిలాబాద్ పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ప్రారంభమైన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు ఉదయం ట్రాఫిక్ పార్కులో ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ చిన్నారులకు ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ గుర్తులు, రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ క్రమశిక్షణ, జీబ్రా క్రాసింగ్ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రాముఖ్యత, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాలు నడిపేటప్పుడు పాటించాల్సిన నియమాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం ద్వారా బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు ఉత్సాహంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన పొందుతూ పోలీస్ అధికారులతో ముచ్చటించారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలి: ఎస్ఎఫ్ఐ

### - నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్

### - రామడుగు ఎంఈఓ కార్యాలయం తలుపునకు వినతిపత్రం

ప్రజదర్బార్, రామడుగు, మే 16: ప్రైవేట్ పాఠశాలల్లో అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం రామడుగు మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా, అధికారి అందుబాటులో లేకపోవడంతో ఆఫీస్ రూమ్ డోర్‌కు వినతిపత్రాన్ని తగిలించి విద్యార్థి నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను బేఖాతరు చేస్తూ, అడ్మిషన్ల పేరిట వేలాది రూపాయలు గుంజుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.
2. ఆర్భాటాల ప్రచారాలతో మోసాలు కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు కార్పొరేట్ స్థాయిలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్భాటపు ప్రచారాలు చేసుకుంటున్నాయని విమర్శించారు. ఈ రంగుల ప్రచారాలకు ఆకర్షితులై తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తున్నారని, తీరా చేరిన తర్వాత రకరకాల ఫీజుల పేరిట వేధింపులకు గురిచేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలపై జిల్లా విద్యాధికారి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఫీజుల నియంత్రణ చట్టాన్ని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేసి, ప్రతి స్కూల్‌లో ఫీజుల వివరాల బోర్డులను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్ల గుర్తింపును రద్దు




చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థి లోకం ఉద్యమించాలి ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలను అడ్డుకోవడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థను వ్యాపారమయంగా మారుస్తున్న శక్తులపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని అరవింద్ హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కౌకూర్‌లో విద్యుత్ భద్రతా తనిఖీలు

అల్వాల్, మే 16 (ప్రజాదర్బార్): అల్వాల్ పట్టణపరిధి కౌకుర్ ప్రాంతంలో శనివారం మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ తన బృందంతో కలిసి విద్యుత్ భద్రతా తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తో కలిసి తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలు, ప్రమాదకర ఎల్.టి వైర్లు, ప్రజలకు ముప్పుగా మారిన విద్యుత్ సమస్యలను పరిశీలించారు. హరిజన్ బస్తీ, మహదేవ్‌పూర్ శివాలయం గ్రౌండ్, రెడ్డి బస్తీ, ఇందిరా కాలనీ, హనుమాన్ టెంపుల్ మెయిన్ రోడ్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో లైన్ల తరలింపుపై ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్, కిరణ్, రాజ్ కుమార్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ ప్రదాత ఎమ్మెల్యే కాలే యాదయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పాడువు శ్రీనివాస్

చేవెళ్ల, మే 16 (ప్రజాదర్బార్): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రత్యేక చొరవ చూపుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారని గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే యాదయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య ప్రజలకు అందిస్తున్న సేవలు, నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, తాగునీరు, విద్యా మరియు సంక్షేమ రంగాల అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం సేవలందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్యకు ఆయురారోగ్యాలు కలగాలని, మరింత కాలం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చైన్‌స్నాచింగ్ కేసు ఛేదించిన శాబాద్ పోలీసులు అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

షాబాద్ , మే 16 (ప్రజాదర్బార్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని శాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కలకలం రేపిన చైన్‌స్నాచింగ్ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉండగా అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. ఈ మేరకు శనివారం చేవెళ్ల ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసులు కేసు వివరాలను వెల్లడించారు. డీసీపీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో, మొయినాబాద్ ఏసీపీ బి. కిషన్ ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, శాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి బృందం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఉత్తరప్రదేశ్‌లో నిందితులను అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. నందిగామ మండలం బొగ్గునిగూడ గ్రామానికి చెందిన రెడ్డిమోని భారతమ్మ ఈ నెల 7న షంషాబాద్ నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మద్దూర్ గేట్ సమీపంలో ఘటన చోటుచేసుకుంది. బస్సు దిగిన అనంతరం భర్తకు ఫోన్ చేసేందుకు ప్రయత్నిస్తూ గ్రామం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను గమనించారు. కొంతదూరం వెళ్లి బైక్ ఆపిన ఇద్దరు నిందితులు బాధితురాలి వద్దకు



వచ్చి మెడలో ఉన్న సుమారు 3 తులాలు 5 గ్రాముల బంగారు పుస్తెలతాడు, 4 గ్రాముల పుస్తెలను లాక్కొని హైదరాబాద్ వైపు పరారయ్యారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా శాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా సభ్యులని గుర్తించారు. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామంలో కార్మికులుగా ఉంటూ ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. కేసులో హరిరాజ్ సింగ్, నగేంద్ర సింగ్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు సచిన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టయిన నిందితులపై శంషాబాద్, మహేశ్వరం, షాద్‌నగర్, శాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు దోపిడీ కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఫ్యూచర్ సిటీ కమిషనర్ అభినందించారు.

## జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి.......

మెదక్ జిల్లా ప్రతినిధి, మే 16: (ప్రజా దర్బార్ ) జనగణన 2027లో భాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, జనాభా గణన, గృహ బాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట్ గ్రామంలో జనగణన 2027 ఇండ్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఆర్డిఓ రమాదేవి ,తాసిల్దార్ ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ తో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించి, హౌస్ లిస్టింగ్ (ఇంటింటి సర్వే) ప్రక్రియను కలెక్టర్ స్వయం గా పర్యవేక్షించారు.
ఎన్యుమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన వివరాలను అందించాలని సూచించారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంటాయాని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందన్నారు జనగణన ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, జనగణనలో భాగస్వామ్యులు అయ్యే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు ఈ నెల 11 నుండి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, తాసిల్దార్ రజిని, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బొలగాని రాములు.

తొర్రూరు రూరల్ మే 16 (ప్రజాదర్బార్): ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బోలగాని రాములు సూచించారు. తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక' ఎడ్యుకేషన్ వీక్ ఉత్సవాలలో భాగంగా శనివారం 6వ రోజు కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డా. జి. విజయ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తొలుత ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 2:00 గంటలకు ఏఐ ఆధారిత విద్య: బోధన, అభ్యాసాల భవిష్యత్తు రూపకల్పన అనే అంశంపై వెబినార్, ఆన్‌లైన్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాములు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, భవిష్యత్తు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) విద్యా రంగంలో విప్లవాత్మక




మార్పులకు దారితీస్తోందని, విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఏఐ ఆధారిత నైపుణ్యాలను (ఏఐ స్కిల్స్) అభివృద్ధి చేసుకోవడం ద్వారానే నేటి పోటీ ప్రపంచంలో ముందంజలో నిలవగలరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ఆన్లైన్లో ముఖ్య వక్తగా హాజరైన తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆధునిక విద్యా విధానంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ఏఐ ఆధారిత బోధన పద్ధతులు, విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాలకు అనుగుణంగా సాగే అభ్యాస విధానాలు (పర్సనలైజేడ్ లెర్నింగ్), అధునాతన డిజిటల్ లెర్నింగ్ టూల్స్ వినియోగం ద్వారా విద్యార్థులలో అభ్యాస నైపుణ్యాలు అద్భుతంగా మెరుగుపడతాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సైతం ఏఐ టెక్నాలజీని బోధనలో సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆన్‌లైన్ సెమినార్‌లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నియామకం పట్ల హర్షం

చిట్యాల మే 16 (ప్రజాదర్బార్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రత్యేక కమిటీని నియమించడం పట్ల తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూనూరు సంజయ్ దాసు గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల కుటుంబాలు, అలాగే ఎన్నో కష్టనష్టాలు భరించి ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీతో పాటు, ప్రతి ఉమ్మడి జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక కమిటీల ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ప్రతి ఉద్యమకారుడికి ప్రభుత్వ పరంగా సరైన గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



# పంట అవశేషాలను కాల్చా వద్దు : జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల

గీసుగొండ ప్రజాదర్బార్ మే 16:?గీసుగొండ మండలంలోని వంచనగిరి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం శనివారం గ్రామ సర్పంచ్ కొమ్ముల కమల అధ్యక్షతన విజయవంతంగా నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.?ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల మాట్లాడుతూ.. రైతులు పంట కోతల తర్వాత మిగిలిపోయే ఆకులు, కొమ్మలు, కాండం, వేర్లు వంటి అవశేషాలను తగులబెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. వాటిని భూమిలోనే కుళ్ళింపజేసి, కలిసిపోయేలా చేయడం ద్వారా భూసారాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల అతివాడకం వల్ల నేల, నీరు, గాలి కాలుష్యమవడమే కాకుండా, ప్రజలు క్యాన్సర్ వంటి మహమ్మారి బారిన పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.??కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ విశ్వతేజ్, డా॥ బి. సౌందర్య మాట్లాడుతూ.. రైతులు విత్తన ఎంపికలో ఎలాంటి పొరపాట్లు చేయకూడదని, వాతావరణానికి అనుకూలమైన వరి రకాలను ఎంచుకోవాలని సూచించారు. యూరియా వినియోగాన్ని తగ్గించి, సమతుల్య ఎరువులను వాడడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు.

# సామాజిక సామరస్యం హిందు సమ్మేళనం...

## ఘనంగా హిందు సమ్మేళనం..హిందుల ఐక్యత చాటిన హిందులు..

రాజాపూర్, మే 16 ( ప్రజాదర్బార్) రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా మరియు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో భారీ స్థాయిలో హిందూ సమ్మేళనాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. హిందూ సమాజంలో ఐక్యత, సంస్కృతి పరిరక్షణ మరియు చైతన్యం నింపడమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో ఈ హిందు సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాజాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన హిందు సమ్మేళనంను అట్టహాసంగా ప్రారంభం కావడం జరిగింది. మండల కేంద్రంలోని చట్టపక్కల ఉన్న గ్రామాల ప్రజలు మరియు హిందు బంధువులు భారీ ఎత్తున్న హాజరయ్యారు. చిన్నారుల నృత్యాలు ,భజనాలతో మండల కేంద్రం మారుమోగింది. ఈ సందర్భంగా కొందరు వాక్తలు మాట్లాడుతూ సామాజిక సామరస్యం



కులమతాల పట్టింపులు లేకుండా హిందూ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురావడం. నేటి తరం యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా సనాతన ధర్మ విలువలను కాపాడాలి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వాక్తలు తెలంగాణ సాదు పరిషత్ అధ్యక్షులు శ్రీ శ్రీ శ్రీ శంకర్ స్వామీజీ,లక్ష్మీ కాంత్, డాక్టర్ కళ్లెం స్వప్న మరియు రాజాపూర్ మండల హిందు బంధువులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# మిషన్ మోడ్ ధాన్యం సేకరణ, దొడ్డు రకం దాన్యం బైల్డ్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలి

## రెవెన్యూ అదనపు కలెక్టర్ జె ఎల్ బి హరిప్రియ -శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ఎన్ ఐ సి కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని వైల్డ్ రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ డి.టి.లు, లారీ కాంట్రాక్టర్లతో ధాన్యం సేకరణ పై సమావేశం, సమీక్ష

మహబూబునగర్ అర్బన్, మే 16(ప్రజాదర్బార్): ప్రస్తుతం ధాన్యం సేకరణ పీక్ లో ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి మిషన్ మోడ్ లో ధాన్యం సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేశారని, అందుకు అనుగుణంగా మే నెలలోగా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో 75 మంది రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణలో పాల్గొంటున్నారని, ఇందులో 60 రైస్ మిల్లర్లు, 15 మంది వైల్డ్ రైస్ మిల్లర్లు ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా దొడ్డు రకం దాన్యం సేకరణ బాయిల్డ్ మిల్లర్లు మిల్లింగ్ సామర్థ్యం మేరకు కేటాయించిన ధాన్యం జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. నిలువద్ద హమాలీలు సంఖ్య పెంచుకోవాలని అన్లోడింగ్ త్వరగా వీలు అవుతుందని అన్నారు. లారీ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున ధాన్యం వచ్చిన కొనుగోలు కేంద్రాలకు లారీ ఏర్పాటు చేయాలని అన్నారు. ధాన్యం సేకరణ వేగవంతం



చేసేందుకు, రవాణా సమస్య లేకుండా ట్రాన్స్పోర్ట్, పోలీస్ శాఖ సహకారంతో రోడ్డుపై లారీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాలలో ట్రాన్స్పోర్ట్ శాఖ ఏర్పాటు చేసిన లారీలు ప్రత్యేక వరుసలో ఏర్పాటు చేసి ధాన్యం అన్లోడింగ్ చేసుకోవాలని సూచించారు. పౌరసరఫరాల డీపీలు మిల్లులలో అన్లోడింగ్ మానిటర్ చేయాలని అన్నారు. డి.సి.ఆర్ .బి.డి.ఎస్.పి రమణారెడ్డి, సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రవి నాయక్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి గణనకు ప్రజలు సహకరించాలి :ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మల్కాజిగిరి, మే16, (ప్రజాదర్బార్): ఇంటింటి గణన కార్యక్రమానికి ప్రజలు తమ వంతు సహకారం అందజేయాలని మల్కాజి గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విన య్ కృష్ణారెడ్డి కోరారు. శనివారం ఆయన మల్కాజ్గిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ లో ఆయన స్వయంగా పర్యటించి, క్షేత్రస్థాయి లో చేపట్టిన 'గృహగణన' (హౌజ్స్ లిస్టింగ్) కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి గణన నమోదు ప్రక్రియను సమగ్రంగా చేప ట్టాలని సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో మొత్తం 4 వార్డులు ఉండగా, 281 హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ (హెచ్ ఎల్ బీ ఎస్) ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో 281 మంది ఎన్యూమరేటర్లు, 39 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తు న్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా వినయకృష్ణ రెడ్డి మాట్లా డుతూ తమ ఇంటి వద్దకు వస్తున్న ఎన్యూమరేటర్స్ కి ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తా నా, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నరసిం హారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ: ఏసీపీ బి.కిషన్

షాబాద్,మే 16 (ప్రజాదర్బార్): అప్రమత్తతతోనే నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని చేవెళ్ల ఏసీపీ, ఇన్‌చార్జి మొయినాబాద్ ఏసీపీ బి. కిషన్ అన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని శాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయడంతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు పరిశ్రమల యాజమాన్యాలు, ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కంపెనీల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. పరిశ్రమల వద్ద అనుమానాస్పద వ్యక్తుల సంచారం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే బాల కార్మిక చట్టంపై అవగాహన కల్పిస్తూ చిన్నారులను పనుల్లో నియమిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్మికుల సంక్షేమం, కంపెనీల భద్రత విషయంలో యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని, పరిశ్రమల భద్రత కోసం పోలీసు శాఖతో సమన్వయం కొనసాగించాలని అధికారులు కోరారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

అశ్వాపురం, ప్రజాదర్బార్, మే 16. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలనీ అశ్వాపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి భిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అశ్వాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజిల్ పై మూడు రూపాయలు పెంచడాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తూన్నామన్నారు. డీజిల్, పెట్రోల్ దరల పెరుగుదల వల్ల నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతాయని, పెరిగిన ధరల వల్ల సామాన్య ప్రజలు పై అధికభారం పడుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తురుమలగూడెం సర్పంచ్ కుంజా జాన్, సితారామపురం సర్పంచ్ సప్కా పిచ్చయ్య. బట్టీల గుంపు సర్పంచ్ సరిత, అమెర్ద గ్రామ ఉప సర్పంచ్ అంజిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాక రాములు, కందుల లక్ష్మణ్, బారాజు సంపత్ , మాదినేని రాంబాబు, వెంకటేశ్వర్లు, వేముల విజయ్, తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

## - సుద్దపల్లి, దోమలకుంట గ్రామాల్లో ‘వీఓ’ భవనాలకు శంకుస్థాపన
## - కోటి మంది మహిళలను ‘మహాకోటీశ్వరులు’ చేయడమే ధ్యేయం

ప్రజదర్బార్ , పెగడపల్లి, మే 16 :మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లి, దోమలకుంట గ్రామాల్లో మహిళా సంఘాల (ఐూా) భవనాల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడారు. 1. మహిళా శక్తి పథకంతో ఆర్థిక చేయూత రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అడ్లూరి తెలిపారు. అందులో భాగంగానే ‘మహిళా శక్తి’ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా, వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని స్పష్టం చేశారు. 2. సుద్దపల్లి, దోమలకుంటలకు రూ. 30 లక్షలు మహిళా సంఘాల సమావేశాలు, కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగానే పెగడపల్లి మండలంలోని సుద్ధపల్లి గ్రామంలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో, అలాగే దోమలకుంట గ్రామంలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో నూతన వీఓ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. 3. ప్రతి గ్రామంలోనూ సొంత భవనాలు రానున్న రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలకు సొంత వీఓ భవనాలను నిర్మిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. భవన నిర్మాణ పనులను గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళలు ఈ భవనాలను సద్వినియోగం చేసుకుని సంఘాల బలోపేతానికి కృషి



చేయాలని కోరారు. 4. అభివృద్ధి పథంలో ధర్మపురి నియోజకవర్గంనియోజకవర్గంలోని అన్ని మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రంలో కాంటాల జాప్యం.. రైతుల ఆందోళన

## -- కొనుగోలు కేంద్రం పరిశీలించిన అధికారులు

కాల్వశ్రీరాంపూర్,మే16(ప్రజాదర్బార్): మండలంలోని గంగారం గ్రామ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రైతులపై నిర్వాహకులు వివక్ష చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.కేంద్రంలో ధాన్యం పోసి కాంటాల కోసం రోజులు గడుస్తున్నా,తగిన చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు.తమకంటే తర్వాత ధాన్యం పోసిన రైతుల ధాన్యానికి ముందుగా కాంటాలు వేస్తున్నారని,ఇందులో మర్మం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.వర్షాలు కురిస్తే తమ ధాన్యం తడిసి నష్టపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు పరదాల కిరాయిల భారం పెరుగుతుండగా,మరోవైపు వర్షం వల్ల ధాన్యం తడిస్తే మళ్లీ ఆరబెట్టాల్సి వస్తుందని,దాంతో మరింత ఖర్చు భరించాల్సి వస్తుందని తెలిపారు.తడిసిన ధాన్యానికి కాంటాలు వేయలేమని అధికారులు చెబుతున్నారని,అయితే వర్షం పడితే ధాన్యం తడవడం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి కాంటాల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.ఈ విషయమై నిర్వాహకులను విలేకరులు



ప్రశ్నించగా,తాము రైతుల పట్ల ఎలాంటి పక్షపాతం చూపడం లేదని తెలిపారు.ఐకేపీ కేంద్రంలో స్థలం లేకపోవడంతో కొందరు రైతులు చెరువు వద్ద ధాన్యాన్ని ఆరబోశారని,వర్షం వస్తే ఆ ధాన్యం నీటిలో మునిగే ప్రమాదం ఉండటంతో ముందుగా వాటికే కాంటాలు వేసినట్లు వివరించారు.విలేకరులు కేంద్రానికి వెళ్లిన విషయం తెలిసిన వెంటనే డిపిఎం సంజీవ్,ఏపీఎం లవ కుమార్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులు,పుస్తకాలు పరిశీలించి నిర్వహణ తీరుపై ఆరా తీశారు.సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తూ పనితీరు మెరుగుపర్చాలని ఆదేశించారు.

# అచ్చంపేటలో ఉచిత వైద్య శిబిరం

నర్సాపూర్ మే 16 ( ప్రజా దర్బార్ ) :నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ తుల్చమ్మ బిక్షపతి హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మల్లారెడ్డి ఆసుపత్రి డాక్టర్ నిఖిల్, డాక్టర్ మహమూద్, డాక్టర్ నాగప్ప లు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అంతేగాక ఇంకొంతమందికి ఎక్రేలు స్కానింగ్ టెస్టులు చేయడానికి కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేయడంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తుల్చమ్మ బిక్షపతి మాట్లాడుతూ.. మారుమూల గ్రామమైన అచ్చంపేట గ్రామంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నవీన్ వార్డు సభ్యులు వరమ్మ పెంటయ్య, నరసమ్మ భూమయ్య, ఆసుపత్రి సిబ్బంది సోనీ, నిహారిక, వై సోని, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# 26న లంబాడి హక్కుల పోరాట సమితి మహాధర్నాను విజయవంతం చేద్దాం!!

## లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబల్ నాయక్ పిలుపు...!!

రంగారెడ్డి బ్యూరో చీఫ్ 16 మే (ప్రజాదర్బార్):– గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు 12 హామీలు ఇవ్వడం జరిగిందని అట్టి హామీలను తక్షణమే అమలు చేయాలని ఈనెల 26న ఇందిరాపార్క్ హైదరాబాదులో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబల్ నాయక్ పేర్కొన్నారు.శనివారం శంషాబాద్ మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షులు కడావత్ ఊమ్లా నాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది ఇట్టి సమావేశంలో మహా ధర్నా కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో లంబాడీలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన నేటి వరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదని జిల్లా అధ్యక్షులు కడావత్ ఊమ్లా నాయక్ అన్నారు.తక్షణమే లంబాడి గిరిజనులకు ఇచ్చిన 12 హామీల తో పాటు లంబాడీలకు గిరిజన మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలను అమని అమలు చేయని యెడల రాబోవు కాలంలో కాంగ్రెస్ పార్టీకి లంబాడీలు తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు.26న హైదరాబాద్ కేంద్రంలో నిర్వహించి మహా ధర్నాకు లంబాడీలు పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విస్లావత్ చందర్ నాయక్, మండల నాయకులు రాజు నాయక్, వినోద్ నాయక్, రాజేష్ నాయక్, తిరుపతి నాయక్, రమేష్ నాయక్, బద్రు నాయక్, చిట్టూ నాయక్ పాల్గొన్నారు.



# దోపిడి దొంగ అరెస్టు చేసి 4000 నగదు, ఉప్పు సెల్ఫోన్ స్వాధీనం: మొత్తం 19000 వేల విలువ



(ప్రజాదర్బార్ /ఉప్పల్) మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించి, విశ్వసనీయ సమాచారం ఆధారంగా మహిళపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన నిందితుడిని గుర్తించి శుక్రవారం (15.05.2026) సాయంత్రం నాలుగు గంటలకు ఉప్పల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వివరాలలోకి వెళ్తే.. గురువారం (14.05.2026) రాత్రి 8 గంటలకు రమాదేవి భర్త కీర్తిశేషులు.పి. మాదన్న వయసు 45 సంవత్సరాలు, వృత్తి గృహిణి, నివాసం వడ్డెర బస్తి వార్ధానా ఘాట్, ఎల్బీనగర్, స్వస్థలం కర్నూలు జిల్లా , పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు సమయంలో తాను ఎల్బీనగర్ రింగ్ రోడ్ వద్ద తన చిన్న కుమార్తె ఇంటికి వెళ్లడానికి నిలబడి ఉండగా, ఒక గుర్తు తెలియని వ్యక్తి తన వద్దకు వచ్చి ఉప్పల్ లోని ఒక ఫార్మా కంపెనీలో చెట్లకు నీళ్లు పోవడం, మరియు శుభ్రం చేసే పని ఉందని, ఒక గంట పని చేస్తే 2000/- రూపాయలు ఇస్తానని చెప్పాడు. అతని మాటలు నమ్మి అతనితో వెళ్ళగా, అతను ఉప్పల్ సమీపంలోని చెట్లు ఎక్కువగా ఉన్న గిరిజన ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడని, ఆమె గట్టిగా అరిచినప్పుడు ముఖం, మెడ, వెన్నుపై చేతులతో కొట్టి బెదిరించి, తమ వద్ద ఉన్న ఒక ఉప్పు సెల్ఫోన్, 4000 రూపాయల నగదు బలవంతంగా లాక్కొని అక్కడి నుండి పారిపోయినట్లు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు పై విచారణ చేపట్టిన పోలీసులకు పలు విషయాలు బయటపడ్డాయి. దేశపాక లక్ష్మణ్, తండ్రి రాము, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి ఎలక్ట్రీషియన్/డెకరేషన్ పనులు/నివాసం ఇంటి నెంబర్ 2-3-204/6 దర్బార్ బార్ అండ్ రెస్టారెంట్ లేన, శాంతినగర్ ఉప్పల్.. ను సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పట్టుకున్నారు. అతని యొద్ద నుండి 4 వేల రూపాయలు, ఒక సెల్ ఫోన్ (సెల్ ఫోన్ విలువ 5000.. మొత్తం 19 వేల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా నిందితుడు ఉప్పల్ ప్రాంతానికి చెందిన వాడు. మద్యం సేవించడం వంటి చెడు అలవాట్లకు బానిస అయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో 2022 సంవత్సరంలో ఎన్ డి పి ఎస్ కేసులో ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జైలుకు వెళ్లాడు. ప్రస్తుతం ఎలక్ట్రీషియల్ గా పనిచేస్తూ, బస్ స్టాప్ లు మరియు లేబర్ అడ్డాల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలను ఎంచుకొని నిద్దన ప్రదేశాలకు తీసుకెళ్లి నేరాలకు పాల్పడు తున్నాడు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి సుమతి ఐపీఎస్ నాయకత్వంలో ఉప్పల్ డిసిపి కె సురేష్ కుమార్ ఐపిఎస్, అదనపు డిసిపి ఎన్ వెంకటరమణ, ఏసీబీ వై వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కేసును చేదించిన బృందంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ డి రవికుమార్,, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పిసి జంగయ్య మరియు ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని నిందితుడిని పట్టుకున్నారు.

# బోరు బావిలో పడిన మనువడుని కాపాడబోయి తాత మృతి.





మిర్యాలగూడ, మే 16 ప్రజా దర్బార్:- మిర్యాలగూడ మండలం యాదగిరి పల్లి గ్రామంలో శనివారం ఉదయం విషాదం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామ ఉప సర్పంచ్ కంటు నాగమ్మ భర్త పెద్ద వెంకన్న(55) కి గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. శనివారం పొలం పనులు చేసేందుకు వెళ్లిన వెంకన్నతో మనువడు హేమాన్స్, మనవ రాలు వెళ్లారు. వెంకన్న పొలం పనుల్లో నిమగ్నం కాగా మనవడు హేమాన్ష్ బోరు కేసింగ్ పక్కన ఉన్న ఊట గుంతలో పడి పోయాడు. ఇది గమనించిన బాలుడి సోదరి కేకలు వేయగా తాత వెంకన్న బాలుడిని బయటకు తీసే క్రమంలో ప్రమాద వశత్తు గుంతలో తల కిందులుగా పడ్డాడు. దీంతో ఊపిరి ఆడక వెంకన్న మృతి చెందగా మనవడు హేమాన్స్ ని స్థానికులు బయటకు తీశారు. ఘటనా స్థలానికి మిర్యాలగూడ డి.ఎస్.పి కె రాజశేఖర్ రాజు, సీఐ పీ యన్డి ప్రసాద్, తాసిల్దార్ శ్రీనివాస్, మిర్యాలగూడ రెవిన్యూ అధికారులు, రూరల్ పోలీసులు బోరు గుంతలోంచి తాత, మనవడిని బయటకు తీశారు. అనంతరం బోరు కేసింగ్ పక్కన ఉన్న గుంతను పూడ్చి వేశారు. వెంకన్న మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.



## కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం - జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని డి. సునీత

మహబూబునగర్ రూరల్, మే 16(ప్రజాదర్బార్): కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని డి. సునీత ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ ఇంటర్ కళాశాలలో ప్రవేశానికి గాను ఎస్సీ/ఎస్ టి /ఈ బి సి/బిసి/మైనారిటీ/దివ్యాంగుల విద్యార్థులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 400 మార్కుల కు పైగా సాధించిన పై కులాలకు చెందిన విద్యార్థులు మే 20 నుండి జూన్ 5వ తేదీ వరకు ఆన్ -లైన్ లో వ - జ్ఞుంం వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూన్ 10వ తేదీన ఎంపిక కాబడిన విద్యార్థుల వివరాలు e - pass పబ్లిష్ చేయబడుతుందని తెలిపారు. కావున అర్హులైన విద్యార్థు లు ఈ సదా అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.

## ఉప్పల్ జిహెచ్ఎంసి కార్యాలయం పక్కన ఉన్న వరంగల్ హనుమకొండ యాదగిరిగుట్ట బస్సుల స్టాప్ ను ఉప్పల్ నల్లచెరువు కట్ట సమీపానికి మార్చడం జరిగింది

(ప్రజాదర్బార్/ఉప్పల్) ఉప్పల్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ ఫ్లై ఓవర్ పిల్లర్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉప్పల్ జిహెచ్ఎంసి కార్యాలయం పక్కన ఉన్న వరంగల్ హనుమకొండ యాదగిరిగుట్ట బస్సులో స్టాప్ ను తాత్కాలికంగా నల్ల చెరువు కట్ట సమీపానికి మార్చడం జరిగిందని, ఉప్పల్ రింగ్ రోడ్ మీదుగా ప్రయాణించే ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు తెలిపారు. అలాగే 17/5, 2026 ఆదివారం నుండి ఉప్పల్ రింగ్ రోడ్ లోని వరంగల్లు వైపు వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా ట్రాఫిక్ మళ్లింపులు ఉండే అవకాశం ఉన్న కారణంగా వాహనదారులు అలాగే ప్రయాణికులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకొని ప్రయాణించాలని అధికారులు సూచించారు.

## కేశవరావు నియామకం హాస్యాస్పదం

ఆలేరు,ప్రజాదర్బార్ మే 16:తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన కమిటీకి కే. కేశవరావును ఛైర్మన్‌గా నియమించడం హాస్యాస్పదమని రాష్ట్రీయ లోక్ దళ్ నాయకుడు కపిలవాయి దిలీప్ కుమార్ విమర్శించారు. ఆలేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉన్న వ్యక్తికి ఇలాంటి బాధ్యతలు అప్పగించడం ఉద్యమకారులను అవమానించడమేనన్నారు .తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జూన్ 27న వరంగల్‌లోని కేఐటీఎస్ కళాశాలలో రాష్ట్రీయ లోక్ దళ్ ఆధ్వర్యంలో "రోజ్‌గార్ స్కిల్ అండ్ లోన్ మేళా" నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర యువజన అధ్యక్షుడు రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ "లక్ష్యం కోసం లక్ష సైన్యం" పేరుతో యువత నియామక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



(ప్రజాదర్బార్/భూత్పూర్/మహబూబునగర్)భూత్పూర్ మండలం పోతులమడుగు, తాటికొండ, మూసాపేట్ మండలం బొమ్మిరెడ్డి పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా కార్యక్రమాలకు సంబంధించిన చిత్రమాలిక.

# డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించిన వైద్య ఆరోగ్యశాఖ

# ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగ్యూ నివారణ దినం

## నగరంలోని కుమ్మరి వాడి ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ అండ్ ఇన్చార్జి జిల్లా మలేరియా అధికారి



మహబూబునగర్, మే 16(ప్రజాదర్బార్): జాతీయ డెంగ్యూ నివారణ దినం సందర్భంగా శనివారం నగరంలోని కుమ్మరి వాడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ అవగాహన ర్యాలీని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇన్చార్జి మలేరియా అధికారి డాక్టర్ శశికాంత్ జండా ఊపి ప్రారంభించారు. బండ్ల గిరి ద్వారా తిరిగి పాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం కూడలి వద్ద మానవహారం ఏర్పడి డెంగ్యూ నివారణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ వ్యాధి నివారణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈసారి నినాదం ఏకం అవ్వండి. చర్యలు తీసుకోండి. నిర్మూలించండి. అనే నినాదాన్ని ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని నివారించడానికి ఒక కుటుంబం లేదా ఒక డాక్టర్ మాత్రమే సరిపోదు, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి రావాలి అన్నారు. చర్యలు తీసుకోండి (ఖష్): పరిసరాలను శుభ్రపరచడం, నీటి నిల్వలను తనిఖీ చేయడం ద్వారా నివారణ చర్యలు చేపట్టాలి. నిర్మూలించండి (వశ్రీఋఎఋఅఘ్వ): దోమలు వృద్ధి చెందే పరిస్థితులను సమూలంగా తొలగించడం ద్వారా డెంగ్యూ ని పూర్తిగా అరికట్టవచ్చు అన్నారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నీటి నిల్వలను నివారించండి: ఇంటి పరిసరాలలో, కూలర్లు, పాత టైర్లు, మరియు కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమల కాటు నుండి రక్షణ: పూర్తి చేతులు ఉన్న దుస్తులు ధరించడం, దోమతెరలు ఉపయోగించడం, దోమల నివారణ మందులను వాడటం మంచిది. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు లేదా అనుమానిత లక్షణాలు (అధిక జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు) ఉన్నట్లయితే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి సరైన తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఓ-సిహెచ్ ఐ డాక్టర్ పులి విద్య, డాక్టర్ తస్మా ఫర్హత్, డాక్టర్ విజయ్, హెల్త్ ఎడ్యుకేటర్స్: హనుమంతు, నాగరాజు శెట్టి, సి హెచ్ ఓ లు: వరమ్మ, రమేష్, శ్రీనివాసులు డిపిఎంఓ, యుగంధర్ సబ్ యూనిట్ ఆఫీసర్ అశోక్ రాజు, శ్రీనివాసులు ఎల్. డి కంప్యూటర్, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# ఉప్పుగూడ మరియు మలక్ పెట్ అమృత్ రైల్వే స్టేషన్ లలో పునరాభివృద్ధి పనులను తనిఖీ చేసిన కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి

## శనివారం నాడు ఉప్పు కూడా మరియు మలక్పేట స్టేషన్లలో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి





(ప్రజాదర్బార్ /హైదరాబాద్) కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం (16.05.2026) నాడు ఉప్పు గూడా మరియు మలక్పేట రైల్వే స్టేషన్ లలో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఆయన వెంట హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ, గతి శక్తి మేనేజర్ ఎల్. ఎస్. ఎస్.రావు, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఏ. శ్రీధర్ మరియు ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. కేంద్ర మంత్రి మొట్టమొదట మలక్ పేట మరియు ఉప్పుగూడ రైల్వే స్టేషన్లను సందర్శించి, పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఆయన స్టేషన్ భవన నిర్మాణ పనులు, పార్కింగ్, సర్క్యులేటింగ్ ఏరియా మొదలైన వాటిని తనిఖీ చేశారు. ఆయన పనులు జరుగుతున్న ప్రదేశంలో తీసుకుంటున్న భద్రతా చర్యలను కూడా సమీక్షించారు. అనంతరం, మీడియా ప్రతినిధులను ఉద్దేశించి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వే తెలంగాణలో రైలు మౌలిక సదుపాయాలను గణనీయంగా విస్తరించిందని అన్నారు. 2014-2015 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు బడ్జెట్ కేటాయింపు 1000 కోట్ల రూపాయల కంటే తక్కువగా ఉండగా, 2026 27 ఆర్థిక సంవత్సరానికి గాను కేవలం తెలంగాణ రాష్ట్రానికె 5,454 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించబడిందని తెలియజేశారు. అంతేకాకుండా, ప్రపంచస్థాయి సౌకర్యాలు అలాగే మెరుగైన భద్రతను కల్పించే లక్ష్యంతో, నూతన లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్, బైపాస్ లైన్ల నిర్మాణం, విద్యుదీకరణ మరియు స్టేషనుల పునరాభివృద్ధి వంటి 47,984 కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల కల్పన పనులు పురోగతిలో ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అంతేకాకుండా, గత 12 ఏళ్లలో తెలంగాణలో 347 కిలోమీటర్ల మేర నూతన రైలు మార్గాలను, 556 కిలోమీటర్ల మేర డబ్లింగ్/ట్రిప్లింగ్ పనులను పూర్తి చేశారని, అలాగే 100 శాతం విద్యుదీకరణను సాధించారని ఆయన పేర్కొన్నారు. కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు ముమ్మారంగా కొనసాగుతున్నాయని, ఈ ఏడాది చివర కల్లా దీని కార్యకలాపాలను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఎంఎంపిఎస్ రెండవ దశ విస్తరణను యాదాద్రి వరకు పొడిగించడం ద్వారా, యాదాద్రి ఆలయానికి రైలు అనుసంధానం మరింత మెరుగుపడుతుంది అని మంత్రి తెలిపారు. పుణ్యక్షేత్రమైన కొమరవెల్లి సమీపంలో ఒక కొత్త రైల్వే స్టేషన్ నిర్మించబడిందన్నారు. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ స్టేషన్, బత్తులు పవిత్ర ఆలయాన్ని చేరుకోవడానికి సౌకర్యవంతమైన రైలు ప్రయాణాన్ని సుగమం చేస్తుందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ లో 7 హై స్పీడ్ రైలు క్యారిడార్లు ప్రకటించారని,వీటిలో మూడు తెలంగాణ రాష్ట్రానికి చెందినవి అన్నారు. హైదరాబాద్ పునే, బెంగళూరు మరియు చెన్నై లతో కలుపుతూ వాణిజ్యం, ప్రతిభ మరియు సాంకేతికతను ప్రోత్సహించడంలో సహాయపడతాయి. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 5 మంది భారత్ మరియు 6 అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం'అమృత్ భారత్ స్టేషన్ పథకం'కింద రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తుంది అన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని 40 స్టేషన్లను 2000 కోట్ల రూపాయల కంటే అధికవ్యయంతో పునరాభివృద్ధి చేసేందుకు గుర్తించడం అయినది అన్నారు. ఈ 40 స్టేషన్లో జాబితాలో మలక్పేట మరియు ఉప్పుగూడ రైల్వే స్టేషన్లు కూడా ఉన్నాయి అన్నారు. ఈ రెండు స్టేషన్లో జంట నగరాలలోని అత్యంత పురాతనమైన సబ్ అర్బన్ స్టేషన్లలో రెండవ గుర్తించబడ్డాయి. ఈ స్టేషన్లో ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని, కేంద్ర ప్రభుత్వం అమృ త్ స్టేషన్ పథకం కింద వీటిని ఒక్కొక్కరికి 27 కోట్లను రూపాయల వ్యయంతో పునరాభివృద్ధి చేస్తుంది అన్నారు. ఈ పునరాభివృద్ధి లో భాగంగా ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచడానికి 12 మీటర్ల పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జ), లిఫ్టులు, ఎక్సలేటర్లు, రాంపులు, విశ్రాంతి గదులు, స్టేషన్ ఆవరణ అభివృద్ధి వంటి మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయబడతాయని తెలిపారు. అంతకుముందు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ స్వాగతం చేసి ప్రాజెక్టుల ముఖ్యాంశాలను మీడియాకు వివరించారు.



# జడ్చర్లలో భారీ వర్షం కారణంగా కూలిపోయిన ఇండ్లను పరిశీలించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల,ప్రజాదర్బార్,మే 16: శనివారం జడ్చర్ల మున్సిపాలిటీలో కురిసిన భారీ వర్షం కారణంగా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సంజీవయ్య కాలనీతో పాటు పలు వార్డుల్లో ఇండ్లు కూలిపోయిన ప్రాంతాలను జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబాలను ప్రత్యక్షంగా పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షం వల్ల నష్టపోయిన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇండ్లు కోల్పోయిన కుటుంబాలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నష్టపోయిన ఇండ్లు, ఆస్తులపై వెంటనే పూర్తి స్థాయి అంచనా నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టీసీఎల్ ఇంటలిజెన్స్ పై అవగాహన సదస్సు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6 వ రోజు విద్యా వారోత్సవాలు

(ప్రజాదర్బార్/ ఉప్పల్) ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరవ రోజు ఆర్టిసి సెల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు బోధ నేతల సిబ్బంది అలాగే విద్యార్థుల కోసం ఆర్టీసీఎల్ ఇంటెలిజెంట్ మరియు ఆధునిక విద్యా విధానం అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత డిజిటల్ పార్టీకి సెల్ ఇంటెలిజెన్స్( ఏ ఐ) పరిజ్ఞానం అత్యంత అవసరమైందని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందుకు కోవాలంటే ఏ ఐ పై అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా అధ్యాపకులు మరియు కోదనేతర సిబ్బంది తమ జ్ఞానాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతరం నవీకరించుకుంటూ విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సదస్సులో సీనియర్ సాఫ్ట్వేర్ ట్రైనర్ మరియు డైరెక్టర్ శ్రీనివాస్ బ్రహ్మోజీ ముఖ్యవొత్తగా పాల్గొని "ఆర్టీసీఎల్ ఇంటెలిజెన్స్ మరియు డిజిటల్స్ టూల్స్ ద్వారా ఆధునిక విద్యా విధానం"అంశంపై సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. ఏఐ ఆధారిత పలు టిట్టల్




సాధనాలను విద్యారంగంలో ఎలా వినియోగించుకోవాలా అనే అంశాన్ని ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనను మరింత సృజనాత్మకంగా మరియు బలప్రదంగా ఎలా మార్చుకోవచ్చు వివరిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. భవిష్యత్తులో ఏఐ పరిజ్ఞానం లేని వారు వెనకబడిపోయే ప్రమాదం ఉందని, అందుకు ప్రతి విద్యార్థి మరియు ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యమునా రాణి కార్య క్రమ సమన్వయకర్తగా వ్యవహరించగా కంప్యూటర్ అప్లికేషన్ లెక్చరర్ ప్రవంతి సభ ఉద్దేశాలను వివరించి ముఖ్య వక్తను సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వయసు ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ సత్యనారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్ డాక్టర్ జి తిరుపతయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విశ్వనాథ్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రసాగర్ , సూర్య , అరుణ తదితర అధ్యాపకులు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మిల్లర్ల నిర్లక్ష్యమైతే సీజ్ చేస్తాం: అడిషనల్ కలెక్టర్ సంగీత హెచ్చరిక.

## లారీల కొరతపై అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ; ఫంక్షన్ హాళ్లలోనైనా ధాన్యం నిల్వ చేయాలని ఆదేశం.

పుల్కల్, మే16(ప్రజాదర్బార్)ధాన్యం సేకరణ, రవాణాలో రైతుల ఇబ్బందులను తొలగించేందుకు పరిపాలనా యంత్రాంగం రంగంలోకి దిగింది. వరి కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం తరలింపులో తీవ్ర లారీల కొరత ఏర్పడటంతో, జిల్లా అడిషనల్ కలెక్టర్ సంగీత శనివారం పుల్కల్ మండలంలోని రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రాల్లో వేల సంఖ్యలో ధాన్యం బస్తాలు పేరుకుపోవడానికి, సకాలంలో లారీలు అందుబాటులో లేకపోవడమే ప్రధాన కారణమని గుర్తించారు. లారీల ద్వారా వచ్చిన ధాన్యాన్ని అన్-లోడ్ (ఖాళీ) చేయడంలో రైస్ మిల్లుల యజమానులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అడిషనల్ కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే మిల్లులను తక్షణమే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.మండలంలో ధాన్యం నిల్వ ఉంచేందుకు స్థలం కొరత రాకుండా అడిషనల్ కలెక్టర్ అధికారులకు కీలక సూచనలు చేశారు.మిల్లర్ల స్థలం లేకపోతే ప్రత్యామ్నాయంగా పెద్ద భవనాలను గుర్తించాలి.అవసరమైతే స్థానిక ఫంక్షన్ హోళ్లను కూడా ధాన్యపు నిల్వల కోసం ఉపయోగించుకోవాలని తహసిల్దార్‌ను ఆదేశించారు.రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం వారు తమ ధాన్యాన్ని అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.సంగీత, జిల్లా అడిషనల్ కలెక్టర్.ఈ కార్యక్రమంలో పుల్కల్ తహసిల్దార్ కృష్ణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




## మహిళ రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి




వికారాబాద్ జిల్లాప్రతినిధి, మే16(ప్రజాదర్బార్) మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఈ బిల్లు ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కోటపల్లి సంతోష రాజు అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అతిథి గృహంలో "పోస్టు కార్డులపై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవెం మాట్లాడుతూ....మహిళ బిల్లును వెంటనే అమలు చేయాలని,చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ బిల్లు పై దృష్టి పెట్టాలని అన్నారు.ఈ బిల్లు అమలు జరిగితే మహిళ లోకం దేశాన్ని శాసించే స్థాయికి వెళ్తుందన్నారు.కాంగ్రేస్ పార్టీ జాతీయ మహిళ అధ్యక్షురాలు ఆల్కలంభ,రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు స్వర్ణక్క ఆదేశానుసారం పోస్టు కార్డులపై సంతకాల సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేసి పీఎంఓ కార్యాలయానికి పోస్టు కార్డులను పంపడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళ నాయకురాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహణ

జగదేవపూర్ ప్రజా దర్బార్ మే 16 జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించేందుకు "ూఒ్ఖ, ఖఅట్వ ఖఅఒ జుశ్రీఅఎఆఅఫ్వ ణవఅస్త్రబవ" నినాదంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు..ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత సంవత్సరంలో గ్రామంలో విషజ్వరాలు వ్యాప్తి చెందిన నేపథ్యంలో అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని కోరారు..గ్రామంలోని పలు ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగించి, మురుగు నీరు బయట నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దోమల పెరుగుదలకు కారణమయ్యే పరిస్థితులను నివారించడం ద్వారా డెంగ్యూ వంటి వ్యాధులను నియంత్రించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు, డాక్టర్ రాజశేఖర్, సూపర్వైజర్ ఫాతిమా, ఏఎన్ఎం రజిత, ఆశ కార్యకర్త ఉమారాణి, ఉపసర్పంచ్ అక్కరాజు నాగరాజు, వార్డ్ సభ్యులు కొంతం రామచంద్రం, పోసాన్‌పల్లి కిష్టయ్య, వీరభిరాని కుమార్, గ్రామస్తులు గుండ్రు ఉప్పలయ్య, పోసాన్‌పల్లి నర్సింగం, కొంతం కిష్టయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.